సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



పుస్తకాలయం !

ప్రజలు, విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం ఎంపీ బండి పార్థసారథిరెడ్డి సత్తుపల్లిలో లైబ్రరీ నిర్మించారు. 8లో



నిబద్ధతతో పాలన సాగిద్దాం

కొత్తగూడెం నియోజకవర్గంలో నిబద్ధతతో కూడిన పాలన సాగిద్దామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
$28^{\circ} / 16^{\circ}$

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రికి చలితో పాటు తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బంగారు పూత మకర తోరణాల బహూకరణ



బంగారు పూత మకరతోరణాలతో భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి బంగారు పూత గల మకర తోరణాలను మంగళవారం బహూకరించారు. ఏపీలోని విజయవాడకు చెందిన చల్వాది శ్రీనివాసరావు, రాధిక వర్ధన్, నారాయణ, ధనలక్ష్మి దంపతులు సుమారు రూ. 2 లక్షల విలువ చేసే ఈ తోరణాలను ఆలయ అధికారులకు అప్పగించారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎస్పీ దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ దంపతులు

పాల్వంచ : మండలంలో కొలువుదీరి ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారిని ఆశీర్వదించి అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రజినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రయల్ రన్ సక్సెస్



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న గోదావరిలో నిర్వహించే తెప్పోత్సవానికి లాంచీపై హంస ఆకృతిలో సిద్ధం చేసిన వాహనానికి అధికారులు మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. వాహనం పైకి ఎక్కి నదిలో లోతును అంచనా వేస్తూ చేపట్టిన ఈ ప్రక్రియ విజయవంతమైంది. కాగా, తెప్పోత్సవానికి సంబంధించి భద్రత ఏర్పాట్లను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఐ నాగరాజు రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకం



అరవింద్

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం తెలంగాణ గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థి ఎ.అరవింద్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. వరంగల్‌లో మంగళవారం కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా, అరవింద్ హై జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నకుమారి, అధ్యాపకులు అభినందించారు.

'మై భారత్'లో రిజిస్ట్రేషన్ చేసుకోండి

డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని యువతీ, యువకులు తమ వివరాలను మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పోర్టల్‌ను ప్రారంభించారని, యువతకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, డిజిటల్ లెర్నింగ్, సాంకేతిక నైపుణ్యత తదితర అంశాలను పొందు పరిస్తే భవిష్యత్‌లో వారికి ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. మొబైల్ నంబర్ ద్వారా htttps// mybharath. gov. in పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. తద్వారా వక్తృత్వ పోటీల ద్వారా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం, క్రీడా సామగ్రి పొందడం, యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ద్వారా ఇతర రాష్ట్రాలను సందర్శించడం, సాంకేతిక శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ఉపాధి అవకాశాలను పొందడం వంటి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

మరలా ఇక్కడికే!



బూర్గంపాడు నుంచి పొరుగు రాష్ట్రానికి తరలుతున్న సన్నరకం ధాన్యం

జిల్లాలో పెరుగుతున్న వరి సాగు

- ధాన్యానికి సరిపడా లేని రైస్ మిల్లులు
- ఇతర రాష్ట్రాల్లో మర ఆడించి తిరిగి ఇక్కడే బియ్యం అమ్మకం
- అధిక ధరలతో నష్టపోతున్న జిల్లా ప్రజానీకం
- కొత్త మిల్లుల ఏర్పాటుపై కనిపించని ప్రోత్సాహం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో జిల్లాల విభజన చేపట్టి ఏడేళ్లు పూర్తయినా నేటికీ ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ పారిశ్రామిక రంగంలో ఈ లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

పెరుగుతున్న వరి సాగు

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకంతో గత రెండు దశబ్దాల కాలంలో జిల్లాలో క్రమంగా వరిసాగు పెరుగుతూ వస్తోంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణతో ఈ సాగు మరింతగా వేగం పుంజుకుంది. అందులోనూ సన్నరకం వరి ధాన్యం జిల్లాలో పెద్ద ఎత్తున సాగవుతోంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.61 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా, ఇందులో 1.47 లక్షల ఎకరాల్లో సన్న రకాలే సాగయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధాన్యానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో వ్యాపారులు వరి కోయడమే ఆలస్యం.. ఆరబెట్టాల్సిన అవసరం లేకుండానే కొనుగోలు చేస్తున్నారు. ఈ మేరకు రైతులకు ముందుగానే డబ్బులు సైతం చెల్లిస్తున్నారు.

సగానికి పైగా పొరుగు రాష్ట్రాలకే..

జిల్లాలో పండించిన సన్న రకం వరి ధాన్యంలో సగానికి పైగా పొరుగు రాష్ట్రాలకే తరలిపోతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో కనీసం 30 లక్షల క్వింటాళ్ల మేర సన్నరకం ధాన్యం చేతికి వస్తుండగా ఇందులో సగానికి పైగా ఇతర రాష్ట్రాల వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న అశ్వారావుపేట చెక్‌పోస్టు అధికారుల లెక్కల ప్రకారమే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ 19 వరకు (గత యాసంగి, ఈ ఏడాది వానాకాలం పంటలు) 4,11,151 క్వింటాళ్ల ధాన్యం ఏపీకి తరలిపోయింది. ఇతర మార్గాల ద్వారా కూడా తరలిపోయిన సన్న రకాలు అంతా కలిపి 10 లక్షల క్వింటాళ్లకు పైగానే ఉంటుంది. ఇంకా కోతకు రావాల్సిన, విక్రయించాల్సిన పంట చాలా ఉంది. ప్రస్తుతం వరి కోనుగోళ్ల వేగాన్ని పరిశీలిస్తే సగానికి కంటే ఎక్కువ ధాన్యమే జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటి పోవడం ఖాయంగా తెలుస్తోంది. ధాన్యానికి డిమాండ్ ఉండడంతో రైతులు కూడా లాభాలు అందుకుంటున్నారు.

మిల్లుల కొరత..

జిల్లాలో భారీ రైస్ మిల్లులు కేవలం రెండే ఉన్నాయి. ఇందులో ఒకటి జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇలెందులో ఏర్పాటు కాగా, మరొకటి ఇటీవల బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో నిర్మించారు. ఈ రెండు మిల్లులు ప్రధానంగా పారా బాయిల్డ్ రైస్ మిల్లులే. ఇక్కడ ఎక్కువగా రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తుంటారు. అధిక దిగుబడి వచ్చే వానాకాలం పంట ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు సరిపడా భారీ మిల్లులు జిల్లాలో లేవు. ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం మిల్లింగ్ కోసం ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలకు తరలించాల్సిన పరిస్థితి ఇప్పటికీ ఉంది.

పక్కా ప్రణాళిక లేకనే..

జిల్లాల ఏర్పాటు తర్వాత బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు వంటి భారీ పరిశ్రమలు తప్పితే వ్యవసాయ సంబంధింత పరిశ్రమలు వచ్చిన దాఖలాలు పెద్దగా లేవు. రాబోయే రోజుల్లో సీతారామ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే జిల్లాలో వరి సాగు మరింతగా పెరుగుతుంది. ఇప్పటికే దాదాపు లక్షన్నర ఎకరాల పోడు భూములకు పట్టాలు అందాయి. ఇక్కడ సైతం వరి సాగు పెరుగనుంది. వ్యవసాయ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నా అందుకు తగ్గ మౌలిక వసతుల కల్పనలో జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ వద్ద సరైన ప్రణాళిక లేదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. స్థానికంగా ఉన్న పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక కార్యాచరణ ఇప్పటికైనా సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.

తిరిగి ఇక్కడే అమ్మకం..

జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు సన్నరకం ధాన్యాన్ని తరలించిన వ్యాపారులు, మిల్లర్లు అక్కడి మిల్లుల్లో వాటిని ఆడిస్తున్నారు. ఆ తర్వాత పాలిష్ చేసి వివిధ బ్రాండ్ల పేరుతో తిరిగి తెలంగాణలోని భద్రాద్రితో పాటు ఇతర జిల్లాల్లో బియ్యం విక్రయిస్తున్నారు. రవాణా ఖర్చులు, ఇతర లాభాలు అన్నీ కలిపి స్థానికులకు అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇక్కడి పంటే పక్క రాష్ట్రాలకు తరలిపోయి ప్రాసెసింగ్ చేసుకుని తిరిగి అధిక ధరకు వినియోగదారులకు అందుతోంది. స్థానికంగా రైస్ మిల్లులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని జిల్లా రైతులు అంటున్నారు.

నిజరూపం.. పులకించిన భక్తజనం



మిథిలా స్టేడియం వేదికపై నిజరూపంలో ఉన్న రామచంద్రస్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

- రామావతారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య
- కొనసాగుతున్న ముక్కోటి అధ్యయనోత్సవాలు

భద్రాచలంటౌన్ : కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధిగాంచిన భద్రాద్రి క్షేత్రంలో కొలువైన జగదభిరాముడు మంగళవారం నిజరూపమైన రామావతారంలో దర్శనమిచ్చారు. ఈ రూపంలో స్వామివారిని తిలకించిన భక్తులు పులకించిపోయారు. శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ముందుగా దేవస్థాన వేద పండితులు స్వామివారిని బేడా మండపానికి తీసుకొచ్చి రామావతారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, భక్తుల కోలాటాలు, రామ నామ స్మరణల నడుమ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి నివేదన, హారతి చేశారు. భారీగా హాజరైన భక్తులు దర్శించుకున్న తర్వాత స్వామివారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. మిథిలా స్టేడియంలోని వేదిక వద్ద స్వామివారిని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆలయ ఈఓ రమాదేవి, పట్టణ సీఐ నాగరాజు రెడ్డి దర్శించుకున్నారు.



స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న భక్తులు

నేడు బలరామావతారం..

అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సంకర్షణునిగా పిలవబడే బలరాముడు ప్రలంబాసురడనే రాక్షసుడిని సంహరించాడు. ఈ అవతారంలో ఉన్న స్వామివారిని దర్శించిన వారికి సకల బాధలు తొలగిపోతాయని వేద పండితులు చెబుతున్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 30 కేంద్రాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నుంచి డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21, 23, 28, 30, జనవరి 3, 5, 9, 11, 16, 18వ తేదీల్లో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12, 17, 19, 20, 22, 23, 24వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఆన్‌లైన్‌లో పంపించే ప్రశ్నపత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. మొత్తం 122 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 30 సెంటర్లు ఉన్నాయి.

బాలికా సాధికారతకు చర్యలు చేపట్టండి

అదనపు కలెక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బాలికల సాధికారతకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా ఏజెన్సీ ప్రాంతం ఉండడంతో గిరిజనులు, వెనుకబడిన కుటుంబాల్లో బాలికలు ఎక్కువగా ఉన్నారని, వారి హక్కులు, ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత, మానసిక వికాసంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపించడం కొందరు ఆచారంగా భావిస్తారని, తద్వారా జరిగే నష్టాన్ని వారికి వివరించాలని చెప్పారు. సఖి కేంద్ర సిబ్బంది ప్రతిరోజూ ఒక గ్రామానికి వెళ్లి స్థానిక పెద్దలతో పాటు అన్ని వయసుల ఆడపిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో ఒంటరి మహిళ లేదా పూర్తిగా తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో ప్రవేశం కల్పించాలని సూచించారు. ఇందుకోసం పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో కార్మిక శాఖాధికారి సర్ఫుద్దీన్, కేజీబీవీ జీసీడీఓ అన్నామణి, షీ టీం ఎస్‌ఐ రమాదేవి, సఖి అడ్మిన్ జె శుభశ్రీ, సుమిత్రాదేవి, డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'కి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఆర్‌టీసీ ఆర్‌ఎం వెంకన్న



కొత్తగూడెంలోని ఆర్టీసీ బంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం, అధికారులు

చుంచుపల్లి: మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న ఆదేశించారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన కొత్తగూడెం, మణుగూరు డిపో మేనేజర్లు బానాల వెంకటేశ్వరరావు, స్వామితో సమావేశమై మాట్లాడారు. జీరో టికెట్ విషయంలో సంస్థ ఆదేశాల ప్రకారం వ్యవహరించాలని, మహిళలకు ఎదురవుతున్న ఇబ్బందులపై అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా ప్రయాణికులకు తగినట్లు బస్సులు సరిపోకపోతే అప్పటికప్పుడు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే, ఉచితంగా ప్రయాణిస్తున్నారనే భావన విడనాడి మహిళలతో సిబ్బంది మర్యాదతో వ్యవహరించాలని చెప్పారు. అంతేకాకుండా అద్దె బస్సుల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కొత్తగూడెంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్‌ను ఆర్‌ఎం పరిశీలించి నిర్వహణపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఎంలతో పాటు అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి

జీఎంఎస్ జాతీయ నాయకులు లక్ష్మారెడ్డి

మణుగూరు రూరల్ : సింగరేణిలో కొత్త గనులు, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తామని బీఎంఎస్ జాతీయ నాయకులు, వేజ్‌బోర్డ్ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మణుగూరు ఏరియాలో విస్తృతంగా పర్యటించి, ఓసీ-2, మణుగూరు ఓసీ, వర్క్‌షాప్, సింగరేణి ఆస్పత్రి, జీఎం కార్యాలయ ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లనే కొత్త గనులు ఏర్పాటు కాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త గనుల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సింగరేణి కార్మికులకు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు అందాలన్నా, కార్పొరేట్ స్థాయి విద్య అందాలన్నా బీఎంఎస్‌తోనే సాధ్యమని చెప్పారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవనాయక్, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, నాయకులు కిషన్, మల్లికార్జున్, రంజిత్, నరేష్, యోగి, రవీంధర్, రాంబాబు, నర్సింగరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇక అన్నీ ప్రధానమే !

- మినీ అంగన్‌వాడీలు మెయిన్ కేంద్రాలుగా గుర్తింపు
- జిల్లాలోని 626 సెంటర్ల టీచర్లు, ఆయాలకు లబ్ధి
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు



పాత కొత్తగూడెంలోని మినీ అంగన్‌వాడీ సెంటర్

కొత్తగూడెంటౌన్ : మినీ అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ప్రధాన సెంటర్లుగా గుర్తిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లాలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మినీ కేంద్రాల టీచర్లు, ఆయాలు సంబరాలు జరుపుకుంటున్నారు. జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 1,434 ప్రధాన కేంద్రాలు ఉండగా, 626 మినీ సెంటర్లు పని చేస్తున్నాయి. వీటి ద్వారా 6 నెలల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు 34,117 మందికి, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు గల 26,164 మందికి పౌష్టికాహారం కింద పాలు, గుడ్లు, బాలామృతం ప్యాకెట్లను ప్రతి నెలా అందిస్తున్నారు.

626 అంగన్‌వాడీలకు లబ్ధి..

ఇక అన్నీ ప్రధాన కేంద్రాలనేనని ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలోని 626 అంగన్‌వాడీ కేంద్రాలకు లబ్ధి చేకూరినట్టయింది. ఇక జిల్లాలో ఉన్న 2,060 మెయిన్ సెంటర్లుగానే మారనున్నాయి. 626 కేంద్రాల్లో పని చేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రధాన కేంద్రాల్లో పనిచేసే వారికి అందించే వేతనాలు రానున్నాయి. టీచర్ల వేతనం రూ.7,800 నుంచి రూ.13,650కి పెరగనుండగా, ఆయాలు రూ.7,800 చొప్పున అందుకోనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



మాది రామవరంలోని ఎస్‌ఈబీ నగర్ కాలనీలోని మినీ అంగన్‌వాడీ సెంటర్. ఇన్నాళ్లకు మా కల నెలవేరింది. మెయిన్ అంగన్‌వాడీలుగా ప్రభుత్వం గుర్తించడంతో చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు.

– మంజుల, మినీ అంగన్‌వాడీ టీచర్, రామవరం

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



అంగన్‌వాడీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని మేం ఎప్పటి నుంచో కోరుతున్నాం. ఇన్నాళ్లకు అది సాకారం అయింది. ప్రభుత్వ నిర్ణయంతో ఎంతోమంది టీచర్లు, ఆయాలకు మేలు జరుగుతుంది.

– గోనే మణి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

మా వేతనం పెరుగుతుంది



మాది కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం. మా సెంటర్‌ను మెయిన్ కేంద్రంగా మార్చడంతో మా వేతనాలు పెరుగుతాయి. మాకు తీపి కబురు వినిపించిన ప్రభుత్వానికి మా అందరి తరఫున ధన్యవాదాలు. అందరితో సమానంగా పని చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– లావణ్య, మినీ అంగన్‌వాడీ టీచర్, కొత్తగూడెం

80శాతం స్థానికులకే అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కాంట్రాక్టర్లు చేపట్టే పనుల్లో స్థానికులకే 80 శాతం మేర అవకాశం కల్పించాలని డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు అవకాశం దక్కేలా ఈ నిర్ణయం తీసుకోగా, సింగరేణి వ్యాప్తంగా జీఎంలకు ఆదేశాలు పంపించారు. ఈ నిబంధనలు ఓబీ తొలగింపు, బొగ్గు రవాణా, పౌర నిర్వహణ, అటవీ సంరక్షణతో పాటు భద్రతా సేవల్లో అమలు చేయాలని సూచించారు. కాగా, డైరెక్టర్ నిర్ణయం పట్ల పలువురు హర్షం ప్రకటించారు.

విద్యా ప్రగతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న నాగ రాజశేఖర్

ఇల్లెందురూరల్: పాఠశాలల్లో విద్యాప్రగతికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ కో – ఆర్డినేటర్ నాగ రాజశేఖర్ సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాలలో తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలు అమలు కావాలని, ప్రతి ఉపాధ్యాయులు విధిగా డైరీ రాయాలని, పాఠశాల గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ప్రతి నెల పర్యవేక్షణ ఉంటుందని, పర్యవేక్షణ అంశాలను యాప్‌లో పొందుపర్చాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమష్టిగా శ్రమించాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, నోడల్ అధికారి స్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంబాబు, యాదమ్మ, సుధాకర్, శర్మ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెయ్యి ఎకరాల్లో పొగాకు నష్టపోయాం..


బ్యాంకు డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దమ్మపేట: ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపాను ప్రభావంతో వెయ్యి ఎకరాలకు పైగా పొగాకు తోటలు నష్టపోయామని రైతులు వెల్లడించారు. ఈ మేరకు తమకు అదనపు రుణ సౌకర్యం కలి ్పంచి ఆదుకోవాలని బ్యాంకర్లకు వినతిపత్రం అందజేశారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల పొగాకు రైతులు, పొగాకు రైతు సంఘం నాయకులు ఖమ్మం యూనియన్ బ్యాంక్ డీజీఎం హన్మంతరెడ్డిని మంగళవారం కలిసి మాట్లాడారు. రెండు మండలాల్లో కలిపి సుమారు 2 వేల ఎకరాల్లో వర్జీనియా పొగాకు సాగుచేయగా, తుపాన్ కారణంగా వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. పొగాకు లైసెన్స్ కలిగిన రైతులకు అదనంగా రూ.2 లక్షల రుణం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం కార్యదర్శి ప్రకాష్‌తో పాటు కూకలకుంట కిశోర్, సుంకవల్లి వీరభద్రం, అల్లూరి రామారావు, మాధవరావు, సురేశ్ పాల్గొన్నారు.

తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్‌ఈ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల వద్ద గోదావరిలో ఈ నెల 22వ తేదీన శ్రీ సీతారామచంద్రస్వామి తెప్పోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వరరెడ్డి మంగళవారం పరిశీలించారు. నది లోతుల్లోకి ఎవరూ వెళ్లకుండా ఐరన్‌మెష్ ఏర్పాటు చేస్తుండగా అధికారులకు సూచనలు చేశారు. నది లోతు తెలిసేలా బోర్డులు ఏర్పాటుచేయాలని, గజ ఈతగాళ్లను నియమించాలని తెలిపారు. డీఈ మధుసూదన్‌రావు, జేఈ రాజ్‌సుహాస్, పీటీ మస్తాన్ వలీబేగ్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు బంగారు నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు బంగారు నంది అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ బిర్లా సైన్స్ మ్యూజియం ఆడిటోరియంలో మెగా ఎంటర్‌ప్రైజెస్ అధినేత్రి శిరీషరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావుకు బంగారు నంది అవార్డును సినీనటులు సుమన్, సమీర్ అందించారు. ఈ విషయాన్ని మంగళవారం స్థానిక విలేకరులకు అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు తెలిపారు.

ఊరేగింపులో అపశ్రుతి?


స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలంటౌన్: శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. గోదావరి తీరంలోని చప్టా దిగువ ఉన్న ఆలయంలో సోమవారం స్వామి కల్యాణం జరగగా.. మంగళవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపు చేపట్టారు. ఈ క్రమంలో కాల్చిన బాణసంచా జనరేటర్‌పై పడడంతో అది పేలి ఓ వ్యక్తి కాలికి గాయమైనట్లు తెలుస్తోంది. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కాగా, ఘటనలో ఎంత మంది గాయపడ్డారనే వివరాలు తెలియాల్సి ఉంది.

దగ్ధమైన ధాన్యం

దుమ్ముగూడెం: మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన తుష్టి చిన్నబ్బి, నర్సింహారావుకు చెందిన సుమారు 10 బస్తాల ధాన్యం దగ్ధమైన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. రైతులు చిన్నబ్బి, నర్సింహారావు వరి తూర్పారబట్టి సీతానగరం – చిన్నగుబ్బల మంగి వాగు సమీపంలో ఆరబెట్టారు. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి సుమారు 10 బస్తాల ధాన్యం దగ్ధమైంది. సమీప రైతులు గమనించి మంటలను అదుపుచేశారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేక ఎవరైనా నిప్పంటించారా? అనేది తేలలేదు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,454

పుస్తకాలయం!


రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయ భవనం

- వైట్‌హౌస్‌ను తలదన్నేలా డిజిటల్ లైబ్రరీ భవనం
- సత్తుపల్లిలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం
- సొంత నిధులు వెచ్చించిన ఎంపీ బండి పార్థసారథిరెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న పుస్తకాభిమానులు, విద్యార్థులు

సత్తుపల్లి: ప్రజలు, విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా నిలిచేలా రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి అత్యాధునిక వసతులతో డిజిటల్ లైబ్రరీని నిర్మించారు. ఆయన సొంత నిధులు రూ.2కోట్లు వెచ్చించి సత్తుపల్లి బస్టాండ్ సమీపాన గ్రంథాలయాన్ని నిర్మించగా ఇటీవలే ప్రారంభించారు. అమెరికాలోని వైట్‌హౌస్‌ను తలపించేలా ఆధునిక సదుపాయాలతో దీన్ని నిర్మించగా.. సత్తుపల్లి ప్రజల కల సాకారమైనట్లయింది.

దూర ప్రాంతాలకు వెళ్లకుండా..

నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇంటర్, డిగ్రీ, బీఈడీ, నర్సింగ్, ఇంజనీరింగ్ విద్యార్థులు వేలాది మంది చదువుతుండగా, ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరిలో స్తోమత ఉన్న వారు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు శిక్షణ కోసం వెళ్తుండగా మిగతా వారు దూరప్రాంతాలకు వెళ్లలేక స్థానికంగా సిద్ధమయ్యే అవకాశాలు లేక చదువుకు దూరమవుతున్నారు. సత్తుపల్లిలో శాఖా గ్రంథాలయం ఉన్నా అరకొర వసతులు, తక్కువ సంఖ్యలో పుస్తకాలతో స్థానికుల అవసరాలను తీర్చలేకపోతోంది. దీన్ని గమనించిన ఎంపీ పార్థసారధిరెడ్డి గ్రంథాలయాన్ని నిర్మించగా ఉద్యోగార్థులకు మేలు జరగనుంది.


గ్రంథాలయంలోని పుస్తకాలు


పచ్చదనంతో ఆహ్లాదం

అన్ని వసతులతో...

సుమారు పది కుంటల స్థలంలో నిర్మించిన డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి లైబ్రరీ వైట్‌హౌస్‌ను తలదన్నేలా కనిపిస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లల విభాగం, విశాలమైన రీడింగ్‌హాల్, కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు రీడింగ్‌హాల్, అభ్యర్థుల గ్రూప్ డిస్కషన్స్ కోసం కాన్ఫరెన్స్‌రూం, డిజిటల్ లైబ్రరీ ఉన్నాయి. అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచటంతో పాటు సుందరంగా తీర్చిదిద్దారు. ఇక తాగు నీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఒకేసారి వంద మంది కూర్చుని చదువుకునేలా హాళ్లు ఉండగా... వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలాన్ని కేటాయించారు. అంతేకాక ఆవరణలో పచ్చిక బయళ్లతో ఈ లైబ్రరీ ఆకట్టుకుంటోంది.

అంతర్జాతీయ స్థాయిలో..


నేను చదువుకున్న ప్రాంత విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇక్కడి పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడతాయి. విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి.
– బండి పార్థసారధిరెడ్డి, ఎంపీ

బహుళ ప్రయోజనాలు..


రూ.కోట్ల వ్యయంతో డిజిటల్ లైబ్రరీని కట్టించడం ఆనందంగా ఉంది. ఇందుకోసం ముందుకొచ్చిన పారిశ్రామిక వేత్త, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డికి అంతా రుణపడి ఉంటారు. వేలాది పుస్తకాలతో గ్రంథాలయం ఉన్నందున విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించవచ్చు.
– బి.మధుసూదన్‌రాజు, సాహితీవేత్త, సత్తుపల్లి

అన్ని పుస్తకాలు అందుబాటులో..


త్వరలో ఉద్యోగాల భర్తీకి రాత పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సిద్ధం కావాలంటే పుస్తకాలు మాత్రమే సరిపోవు. కానీ కొత్తగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీ మాలాంటి వారందరికీ ఉపయోగపడుతుంది. విలువైన గ్రంథాలయం మాకు చేరువ వడం ఆనందంగా ఉంది.
– బి.గ్రీష్మ, విద్యార్థి, సత్తుపల్లి

మంచి సదుపాయాలు..


ఈ ప్రాంతంలో ఇంత మంచి లైబ్రరీ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. పిల్లలకు అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వందలాది మంది ఒకేసారి చదువుకునేందుకు హాళ్లు ఉన్నాయి. గ్రంథాలయంతో పిల్లలు, విద్యార్థుల్లో పుస్తక అభిరుచి పెరుగుతుంది.
– ఏ.రాంబాబు, ఉపాధ్యాయుడు, సత్తుపల్లి


గ్రంథాలయంలోని ఆర్వో ప్లాంట్

నిబద్ధతతో పాలన సాగిద్దాం

- పాల్వంచలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కృషి
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే కూనంనేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలో నిబద్ధతతో కూడిన పాలన సాగిద్దామని, ఇందులో అధికారుల పాత్ర గొప్పదని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ నియోజకవర్గం రానున్న కాలంలో పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా విరాజిల్లాలని, పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువైన ప్రాంతాలను గుర్తిస్తే ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతానని తెలిపారు. పాల్వంచ మున్సిపల్ ఎన్నికలు జరగక సుమారు 21 ఏళ్లు అవుతోందని, పాల్వంచ మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరిపేందుకు అధికారులు న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను అతి త్వరలో పునఃప్రారంభిస్తామని చెప్పారు. మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని స్పష్టం చేశారు. పట్టణంలో పోలీసుల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పట్టణంలో పార్కింగ్ స్థలం లేని కారణంగా రోడ్డుపై వాహనాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, పార్కింగ్ స్థలం కేటాయించేవరకు ఫొటోలు తీయడం సరికాదని, ఈ విషయమై తాను పోలీసు ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుతోపాటు కొత్వాల శ్రీనివాసరావు, కాపు సీతాలక్ష్మి, సాబీర్‌పాషా, నాగా సీతారాములు, సోనా, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు పదోన్నతులు కొనసాగించాలి

పాల్వంచ: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్లకు పదోన్నతులు ఇచ్చినా ఆ తర్వాత రివర్షన్ చేయడంతో తీరని నష్టం జరిగిందని.. యథావిధిగా పదోన్నతులు కొనసాగించేలా చూడాలని కేటీపీఎస్ ఇంజనీర్లు కోరారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం కలిసి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన సమయాన ఆంధ్రా స్థానికత గల ఉద్యోగులను రిలీవ్ చేయడంతో తమపై భారం పడినా విధులు నిర్వర్తించామని తెలిపారు. కోవిడ్ కాలంలోనూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చేశామన్నారు. ఈ క్రమంలో పదోన్నతులు పొందిన తాము ఐదు నుంచి ఏడేళ్ల పాటు విధులు నిర్వర్తించాక, ఏపీ నుంచి కొందరు ఇంజనీర్లు రావడంతో తమను రివర్షన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యం ఈ అంశాన్ని పట్టించుకోలేదని, కొత్త ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీర్లు కె.సంజీవయ్య, జె.శ్రీనివాస్, కిరణ్‌కుమార్, అనిల్, గోపి, ప్రవీణ్‌కుమార్, రాందాస్, మల్లికార్జున్, ఆర్‌జే అనిల్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీని సస్పెండ్ చేయాలని ధర్నా


హైస్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మంగళవారం పీడీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు, యువజన, మహిళా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌లో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న అరుణకుమారి తన కారును ఈ నెల 15న 8వ తరగతి విద్యార్థుల చేత కడిగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ మాట్లాడారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) అరుణకుమారి విద్యార్థులతో తన సొంత కారును కడిగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పీడీని తక్షణమే స్పందించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోడా అభిమిత్ర, ఎస్కే చాంద్‌పాషా, ఆనగంటి లక్ష్మి, లక్కినేని అపర్ణ, కమ్మూరు జ్యోతి పాల్గొన్నారు.

పీడీకి షోకాజ్ నోటీస్..

ఈ విషయంపై జూలూరుపాడు హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్యను వివరణ కోరగా పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న అరుణకుమారికి సోమవారం డీఈఓ వెంకటేశ్వరాచారి ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 15న పీడీ అరుణకుమారి తన కారును 8వ తరగతి విద్యార్థుల చేత శుభ్రం చేయిస్తుండగా కొందరు వీడియో తీసి డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు హెచ్‌ఎం చెప్పారు.

కోటి తలంబ్రాల వడ్లకు పూజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణంలో వినియోగించే కోటి గోటి తలంబ్రాల వడ్లకు మంగళవారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన భక్తులు నియమనిష్టలతో పండించిన వరి గింజలను రామయ్య సన్నిధికి తీసుకొచ్చి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు చేయించారు. అనంతరం వాటిని గోటితో వలిచి రామయ్య కల్యాణ సమయానికి ఆలయ అధికారులకు అందజేయనున్నట్లు భక్తులు పేర్కొన్నారు.


ఆలయంలో తలంబ్రాల వడ్లతో భక్తులు

బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు

ఖమ్మం లీగల్: తిరుమలాయపాలెం మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం పోక్సో కోర్టు–2 ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు చెప్పారు. ఈ ఘటనపై తిరుమలాయపాలెం పోలీసులు నిందితుడు గోపిపై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.రూ.50వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ పసుపులేటి శ్రీనివాస్ వాదించగా మోహన్‌రావు, భద్రాజీ, చిట్టిబాబు సహకరించారు.

వరికోత మిషన్ దగ్ధం

కరకగూడెం: వరికోత మిషన్ దగ్ధమైన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కరకగూడెం గ్రామానికి చెందిన దగ్గుమాటి నరేంద్రబాబు వరి కోత మిషన్ కొనుగోలు చేసి కిరాయికి నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగానే సోమవారం రాత్రి 10 గంటల వరకు అనంతారం గ్రామ సమీపంలో వరి పొలాలను కోసి మిషన్‌ను అక్కడే ఉంచి ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా వరికోత మిషన్ పూర్తిగా దగ్ధమై ఉంది. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. అకస్మాత్తుగా వరి కోత యంత్రం దగ్ధం కావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


దగ్ధమైన వరికోత యంత్రం

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామ పంచాయతీ వేములవాడ గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్లమూడి సురేశ్, గోగినేని సీతారామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్వగ్రామం కొత్తపేట నుంచి బైక్‌పై ఇరువురు నేతలు ఇల్లెందు వస్తుండగా మార్గమధ్యలోని వేములవాడ గ్రామంలో అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన పశువులను నేరుగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు ఇద్దరినీ మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


తీవ్రంగా గాయపడిన వడ్లమూడి సురేశ్


తీవ్ర గాయాలపాలైన సీతారామయ్య

పోక్సో కేసులో వ్యక్తికి జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: పోక్సో కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల 26 రోజుల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి (పోక్సో స్పెషల్ జడ్జి) ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. 2021 జనవరి 30వ తేదీన పొగర్తా రాజేష్.. మైనర్ అయిన తమ కుమార్తెను కిడ్నాప్ చేశాడని పోలీస్ స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ వి.వెంకటేశ్వరావు కేసు నమోదు చేయగా, ఎస్పీ జి.వినీత్, అప్పటి ఏఎస్పీ రోహిత్‌రాజ్ దర్యాప్తు చేసి రాజేశ్‌పై చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. 14 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి రాజేశ్‌పై నేరం రుజువు కావడంతో రెండేళ్ల 26 రోజుల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీ రావి విజయ్ కుమార్ వాదించారు. లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, భద్రాచలం ఏఎస్‌ఐ శశిధర్ సహకరించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామ పంచాయతీ నిజాంపేట గ్రామం వద్ద రివర్స్‌లో ప్రధాన రహదారి మీదకు వచ్చిన ట్రాక్టర్, అదే మార్గంలో వెళ్తున్న కారు ఢీకొన్నాయి. కారుడ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. మహబూబాబాద్ జిల్లా సింగారం గ్రామానికి చెందిన పెంటి దేవేందర్‌రెడ్డి ఇంట్లో జరుగుతున్న వివాహానికి మణుగూరు ప్రాంతానికి చెందిన పెళ్లి కుమారుడిని తీసుకెళ్లేందుకు కారులో వస్తున్న పెళ్లి పెద్దలు ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. రహదారిపై వాహనాల రాకపోకలను చూసుకోకుండా ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా రివర్స్‌లో ట్రాక్టర్‌ను రోడ్డుమీదకు తీసుకురావడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం తప్పడంతో పెళ్లి బృందం ఊపిరిపీల్చుకుంది.

రామాలయంలో నలుగురు అర్చకులకు పదోన్నతి


నియామకపత్రాలు అందిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో పని చేస్తున్న నలుగురు అర్చకులకు ముఖ్య అర్చకులుగా ఆలయ ఈఓ రమాదేవి పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంలో కొన్నేళ్లుగా అర్చకులుగా పనిచేస్తున్న రామభద్రాచార్యులు, విష్ణువర్ధనాచార్యులు, కిరణ్‌కుమార్, కిరణ్‌కుమారాచార్యులుకు పదోన్నతి కల్పిస్తూ నియామక పత్రాలను ఈఓ అందజేశారు.

108 వాహనం తనిఖీ


108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గుండాల: ఆళ్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని 108 వాహనాన్ని మంగళవారం జిల్లా అంబులెన్స్ వాహన ఆడిట్ అధికారి ఫకీర్ దాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 108 వాహనాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, వాహనంలోని ఔషధాలను, పరికరాలను, వాటి పనితీరును, రికార్డుల నిర్వహణకు సంబంధించిన పలు విషయాలను ఈఎంటీ, పైలెట్లకు వివరించారు. అంబులెన్స్‌లో గడువు ముగిసిన ఔషధాలు ఉంచొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఈఎంటీ ప్రేమలత, పైలెట్లు పరమ శ్రీహర్ష, పరమ సునీల్‌కుమార్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. రుక్మాతండా, సాయన్నపేట, తొమ్మిదోమైలు తండాల్లో దాడులు చేసిన అధికారులు 150 కేజీల నల్లబెల్లం, 10 కేజీల పటిక, 18 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. రేగళ్లకు చెందిన గణేశ్, తొమ్మిదోమైలు తండాకు చెందిన దేవీలాల్, హరిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి ఆటో, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో అధికారులు సర్వేశ్వర్, ముబాషీర్ అహ్మద్, బాలు, సుదీర్, వెంకటేశ్, హరీశ్ సిబ్బంది పాల్గొన్నారు.

కండక్టర్‌పై పలువురి ఆగ్రహం

అశ్వారావుపేటరూరల్: విద్యార్థిని విషయంలో ఆర్టీసీ కండక్టర్ వ్యవహరించిన తీరుపై మంగళవారం రాత్రి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పాతనారంవారిగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న పల్లెవెలుగు బస్సు ఎక్కారు. ఈ క్రమంలో టికెట్ అడిగిన మహిళా కండక్టర్‌కు ఓ విద్యార్థిని తన బ్యాగ్‌లో బస్‌పాస్, ఆధార్ కార్డు కనిపించడం లేదని చెప్పింది. దీంతో కండక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసభ్యకరంగా మాట్లాడినట్లు విద్యార్థిని వాపోయింది. డబ్బులు ఇచ్చి టికెట్ తీసుకోగా బస్సును స్టేజీ దాటించి, ఊరికి దూరంగా ఆపడంతో వివాదమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు, కొంతమంది గ్రామస్తులు కలిసి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చి కండక్టర్‌ను నిలదీశారు. కొద్ది సేపటి తర్వాత కండక్టర్ తప్పు ఒప్పుకోవడంతో వివాదం సద్దుమనిగింది.